క్లుప్తంగా

రొంపిచర్లలో 5.2 మి.మి.వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో భారీ వర్షాలు కురిసాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో సోమవారం ఉదయానికి 5.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. అయితే రెండు మూడు రోజులుగా మండలంలోని రైతులు దమ్ము వరినారుమళ్ల సాగుకు ఉపక్రమించారు. ఈ వర్షానికి నారుమళ్లలో చల్లిన విత్తనాల మొలకలు తిరగబడతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కారణంగా వరినారు మొలక శాతం తగ్గుతుందని కూడా రైతులు తెలుపుతున్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్టా వేడుకలు

శావల్యాపురం: స్థానిక బీసీ కాలనీ వడయరాజులు సారథ్యంలో శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ సమేత దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ధ్వజ స్తంభ ప్రతిష్టా వేడుకలు ఉదయం 8.07 నిమిషాలకు వేదపండితులు వేద మంత్రాలు మేళతాళాల నడుమ గుంటూరు శేషాచార్యులు, దీవి శ్రీకాంత్ భట్టర్ తన బృందం సభ్యులచే ప్రతిష్టా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులందరు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భారీ అన్నదాన సంతర్పణ కార్యక్రమం కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

భోజన ప్లేట్లు పంపిణీ



రొంపిచర్ల: మండలంలో వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు పాలిమేర వెంకటరెడ్డి, జిర్రా వెంకటసాంబశివారెడ్డిలు రూ.17,500 రూపాయలు విలువ చేసే 200 భోజన ప్లేట్లు అందజేశారు. అదే విధంగా రానున్న విద్యా సంవత్సరం నుండి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.5,000, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.3,000 రూపాయలు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు తొరటి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు కసిరెడ్డి వెంకట కోటిరెడ్డి, దుద్దుకుంట వెంకటరామిరెడ్డి, పాలిమేర శ్రీనివాస్ రెడ్డి, గంగారపు వీరారెడ్డి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

వినుకొండ: నియోజకవర్గంలోని ఈపూరు మండలంలోని అంగలూరు గ్రామం నందు గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, సాధు సిద్ధమూర్తి, లక్ష్మీగణపతి ఈశ్వరమ్మ, మంజునాథేశ్వర స్వామి, నందీశ్వర స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్, మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల: మండలంలోని తూబాడు గ్రామంలో పోలేరమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో సోమవారం గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అంకమ్మ తల్లి, పోర్ల అంకమ్మ తల్లి, పోతురాజు విగ్రహాలను శాస్త్రోక్తంగా మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్టించారు. ఆలయ జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా యాగశాలలో శాంతిహోమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పెద్దకాపు కుటుంబ సభ్యులు చెన్నుపాటి రామానుజయ, ఆనె వెంకటేశ్వర్లు, శిరిబోయిన శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ దగ్గుపల్లి హరిగోపాలం, జీడీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, సహకార బ్యాంక్ రిటైర్డ్ డీజీఎం సుబ్బారావు, ఉపసర్పంచ్ మద్దుకూరి కోటిరెడ్డి, యాగంటి రఘురాం పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీడీపీఓ

నరసరావుపేట: ఐసీడీఎస్ నరసరావుపేట ప్రాజెక్ట్ సీడీపీఓగా నేలపాటి కాంతకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాజెక్టులో గ్రేడ్–1 సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై సీడీపీఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అంగన్వాడీలతో మాట్లాడుతూ మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుంచి ఏడో తారీకు వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులు, గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు. అసిస్టెంట్ సీడీపీఓ మాణిక్యాలరావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

వినుకొండ: ఒంగోలులో ఈ నెల 17,18 తేదీల్లో జరిగే ఏపీ గొర్రెలు, మేక పెంపకందారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని రాష్ట్ర సహాయకార్యదర్శి తోట తిరుపతిరావు కోరారు. ఈ మేరకు పట్టణంలోని గొర్రెల మండిలో కరపత్రాల ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం కోసం ఈ మహాసభలలో రాష్ట్ర వ్యాప్తంగా పెంపకందారుల ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి సమగ్ర కార్యచరణ రూపకల్పన చేయబోతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసపాటి వెంకట్రావు, బుర్రి ఆంజనేయులు, పల్నాడు జిల్లా నాయకులు కోనంకి వెంకట్రావు, ఐలయ్య, బైలడుగు కొండ గురవయ్య, అడక అంజయ్య, తోట గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వత్తాసు పలికే అధికారులపై న్యాయపోరాటం చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు కూటమి నాయకులకు ధారాదత్తం చేస్తున్నారు
- క్యాబినెట్ హోదా.. అయినా సొంతూరికి రోడ్డేసుకోలేని వ్యక్తి ఎమ్మెల్యే జీవీ
- కలసికట్టుగా పనిచేస్తే రానున్న ఎన్నికల్లో మనదే విజయం
- ఈపూరులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు



హాజరైన కార్యకర్తలు నాయకులు

వినుకొండ: ఎన్నికలకు ముందు అలవికాని హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం పనితీరు అందరికీ తెలిసిపోయిందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. సోమవారం ఈపూరు మండలంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ సభను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా బొల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా ఎల్లో మీడియా ద్వారా అసత్య ప్రచారాలు తప్ప అభివృద్ధి ఎక్కడా లేదన్నారు. రేషన్ బియ్యం ఉపాధి హామీ పనుల్లో దోపిడీ, అక్రమ మద్యం, ప్రతి గ్రామంలో బెల్టు షాపులు ఏర్పాటు చేయడంతో పాటు పేదల ఆస్తులు దోచుకోవడం అక్రమ కేసులు నమోదు చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు

కూటమి ఈపూరు మండలంలో నాయకులు ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని, మండల తహసీల్దార్ 22 నిషేధిత భూముల జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిని సైతం కూటమి నాయకులకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. బొమ్మరాజుపల్లి గ్రామంలో సర్వేనెం 3 లో 90 ఎకరాలు ఆక్రమించారని, పేదలు సాగు చేసుకునే భూములు సైతం లాగేసుకుంటున్నారని అన్నారు. గోపువారిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే బినామి 16 ఎకరాల భూమిని ఆక్రమించుకుని పేదరైతు భూములు కూడా ఆక్రమించారని విమర్శించారు.

చట్టపరంగా ఎదుర్కొంటాం

కూటమి నాయకుల మెప్పు కోసం పనిచేస్తున్న అధికారుల మీద ప్రైవేట్ కేసులు న్యాయపోరాటం చేసి సదరు అధికారులను బోనులో నిలబెడతామని హెచ్చరించారు. కూటమి నాయకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను సానుభూతి పరులను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న అందరి పేర్లు గుర్తు పెట్టుకుని తమ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం వారిపై చట్టపంగా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నీ అసత్య ప్రచారాలే

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని అన్నారు. ఇక్కడ ఉన్న శాసనసభ్యుడు చీఫ్ విప్ క్యాబినెట్ హోదాలో ఉన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సొంత గ్రామానికి రోడ్డు వేయడం కూడా చేతకాలేదన్నారు. అసత్య ప్రచారాలు, తాము చేసిన పనుల శిలాఫలకాలు ధ్వంసం చేయడం, తమ హయాంలో జరిగిన పనులను వారు చేసినట్లు బ్యానర్లు వేయడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పండించిన పంటకు కనీస మద్దతు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రాజధానిలో రైతులకు కూడా బాబు న్యాయం చేయలేకపోయాడని ఎద్దేవా చేశారు. నేడు ఎరువులు సైతం నేడు బ్లాక్ మార్కెట్‌లో కొనాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం చేయడానికి అందరం సమష్టిగా కలసి పనిచేసి మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేద్దామని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈపూరు మండల కన్వీనర్ కొండావర్జు నాగేశ్వరరావు, కొచ్చెర్ల సర్పంచ్ కోపెల దేవారాజ్, అంగలూరు సొసైటీ మాజీ అధ్యక్షులు జానీలతోపాటు నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు మండల సోషల్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక



శ్రీనివాసరాజును అభినందిస్తున్న కోటేశ్వరరావు

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కళాశాలలో సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న సి.హెచ్.మారుతీ శ్రీనివాసరాజు నరసరావుపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ చాటినట్టు తెలిపారు. సుపెయిన్, అర్టిస్టిక్ పెయిర్ ఈవెంట్ విభాగాలలో ప్రథమ బహుమతిని గెల్చుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. ఆగస్టు 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తాడేపల్లి గూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో శ్రీనివాసరాజు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎంవీ కోటేశ్వరరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఝాన్సీ వజ్రం, వ్యాయామ అధ్యాపకులు ఎల్. కృష్ణారెడ్డి, ఎస్.ఆంజనేయులు, పి.విజకుమార్ అభినందించారు.

క్వారీ మృతులకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

క్షతగాత్రులను పరామర్శించిన సీఐటీయూ నాయకులు



హాస్పిటల్‌లో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఆంజనేయులు నాయక్

నరసరావుపేట: బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొణిదెన గ్రామ పరిధిలో గల సత్యకృష్ణ క్వారీలో వాటిల్లిన ప్రమాదంలో మృతులకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం, క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయం, కోలుకునే వరకు ఉచిత మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జీబీఆర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇరువురు క్షతగాత్రులకు కాలు తొలగించాల్సిన పరిస్థితి రావొచ్చని వైద్యులు నాయకులకు వివరించారు. ఘటన జరిగిన తీరును క్షతగాత్రులను అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు.

ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ ఘటనపై న్యాయ విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. వలస కార్మికుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సత్యకృష్ణ క్వారీలో అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని దీనిపై సమగ్ర విచారణ జరిపి అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి నిందితులను జైలుకు పంపాలన్నారు. మృతులకు రూ.14 లక్షలు, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష క్వారీ యాజమాన్యం ప్రకటించిందని, సహాయాన్ని ఇంకా పెంచి ఇవ్వాలని, ప్రభుత్వం కూడా త్వరితగతిన స్పందించి పరిహారం ప్రకటించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా క్వారీలలో భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కోశాధికారి డి.శివకుమారి, నరసరావుపేట మండల కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ పాల్గొన్నారు.

అమ్మపాలు బిడ్డకు అమృతం

యడ్లపాడు: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ యడ్లపాడు సూపర్‌వైజర్ ఎస్.అరుణ పేర్కొన్నారు. మండలంలోని లింగారావుపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అప్పట్లో జన్మించిన శిశువుకు ముర్రుపాలు పట్టించడం వలన రోగ నిరోధక శక్తిగా అవి పనిచేస్తాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామీణ మహిళా పోలీస్ కె.శిరీషా, ఎంఎల్‌హెచ్‌పీ పి.పద్మ, ఆరోగ్య కార్యకర్త పి.పార్వతి, ఆషా వర్కర్ ఎం.మల్లేశ్వరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పున్నమ్మ, టి. సుధారాణి పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ: పట్టణంలోని ఎ.సెక్టార్‌లో లైబ్రరీ బజారు అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సూపర్‌వైజర్ శేషకుమారి పాల్గొని మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ మేడం కమలబాయి, ఏఎన్ఎం అశ్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.సుజాత, ఎ.రత్నకుమారి, సీహెచ్. సుచరిత ఎం.రమాదేవి, ఎస్. ఉమామహేశ్వరి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గణపవరంలో...

నాదెండ్ల: బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టినట్లయితే సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శాంత కుమారి చెప్పారు. గణపవరం 17వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పీహెచ్‌సీ వైద్యులు కవితాఅనసూయ, ఎల్.ప్రసాద్‌నాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ముగిసిన స్కౌట్స్ తృతీయ సోపాన్



నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయలో ఈ నెల 1న ప్రారంభమైన తెలంగాణ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ 2025 సోమవారంతో ముగిసింది. క్యాంపు చివరిరోజు ఉదయం స్కౌట్స్ విద్యార్థులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ ప్రతిభవించింది. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి నరసరావుపేట జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

మన్నించుమా.. మహావృక్షమా!





ప్రాణాపాయ స్థితిలో ఆక్సిజన్ అందించి జీవితాన్నిచ్చిన వైద్యుడిని దేవుడని పిలుచుకుంటాం. కానీ జీవితాంతం ఉచితంగా ఆక్సిజన్ ఇచ్చే చెట్లను మాత్రం ఖాతరు చేయం. 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు', 'మొక్క నాటితే క్షేమం – చెట్టు నరికితే క్షామం' అంటూ వేదికల మీద సుదీర్ఘ ఉపన్యాసాలూ ఇస్తాం. ఆచరించి చూపం. ప్రకృతి–అద్దం రెండూ ఒకటే. అద్దం మనం ఎలా ఉంటే అలా చూపిస్తుంది. ప్రకృతిని మనం ఎంత కాపాడితే అది అంత మనల్ని కాపాడుతూ ఉంటుందని పెద్దలు చెబుతారు. కానీ నరసరావుపేటలో ప్రాణాధారమైన వృక్షరాజాలు నెలకొరుగుతున్నాయి. నాగార్జునసాగర్ నిర్మాణం సమయంలో ఏర్పాటైన లింగంగుంట్ల ఎన్నెస్పీ కాలనీలో మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఐదు దశాబ్దాల కాలంలో ఆ చెట్లు మహా వృక్షాలయ్యాయి. ఆ ప్రాంత వాసులకు నీడతో పాటు స్వచ్ఛమైన గాలినీ అందించాయి. నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలను ఈ కాలనీలో ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఏరియా వైద్యశాల నూతన భవనాలను నిర్మించారు. దీనికి అనుబంధంగా సీసీయూ యూనిట్‌ను నెల్పకొల్పనున్నారు. ఇందుకోసం ఎస్పీ కార్యాలయం పక్కనే ఉన్న స్థలాన్ని కేటాయించారు. ఇప్పటి వరకు ఎస్పీ కార్యాలయ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొన్నారు. సీసీయూ యూనిట్ నిర్మాణాలు ప్రారంభించేందుకు ఆ ప్రాంతంలోని చెట్లను తొలగించేందుకు టెండర్లు పిలిచారు. కాకానికి చెందిన వ్యక్తి టెండరు దక్కించుకొని చెట్ల నరికివేతను ప్రారంభించారు. రావి, వేప, చింత చెట్లను మిషన్‌లను ఉపయోగించి నెలకూల్చారు. భారీ వృక్షాలు నేలకొరగడంతో ఈ ప్రాంతం నేడు బోసిపోయింది.

– నరసరావుపేట రూరల్

బోరుబావి పూడ్చేందుకు యత్నం



బొల్లాపల్లి: గ్రామానికి మంచినీరు అందించే పంచాయితీ బోరు పూడ్చి వేతకు ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామ సర్పంచ్ బాణావత్ మంగా భాయ్‌తో పాటు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో పంచాయతీ స్థలంలో వేసిన బోరునీరే గ్రామానికి ఏకైక ఆధారమని, ఈ బోరు పూడ్చివేతకు ప్రయత్నిస్తున్న వారిని ఆపాలని అంటున్నారు. గత ఐదేళ్ల నుంచి ఈ బోరే గ్రామం మొత్తానికి మంచినీరు అందిస్తుందని, అప్పట్లో పంచాయతీ స్థలంలో బోర్ వేయటంతో పాటు ఫెన్సింగ్ వేడయడం జరిగిందని తెలిపారు. గ్రామానికి చెందిన డి.భాగ్య నాయక్, బాలాజీ నాయక్‌కు చెందిన ఇంటి స్థలాన్ని ఆనుకొని ఉన్న పంచాయతీ స్థలంలో అప్పట్లో బోరు వేశామని అదే నీటి ఎద్దడి ఉన్న సమయంలో గ్రామం మొత్తానికి నీరు సరఫరా జరిగిందని వాపోతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ఎ.వి సుధాకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.సీతారామయ్యలకు వినతిపత్రం అందజేశారు

హామీలు అమలు చేయకుండా మోసాలు

- వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి
- 32వ వార్డులో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి

చిలకలూరిపేట: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసానికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని 32వ వార్డులో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా వార్డు పరిధిలో సమావేశం నిర్వహించి, ఇంటింటికీ తిరుగుతూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ ప్రజలతో చేయించారు. ఈ సందర్భంగా దరియావలి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదన్నారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిందేమి లేదని అయినప్పటికీ సుపరిపాలన పేరుతో ప్రచార ఆర్భాటానికి తెరతీయడం వారి మోసపూరిత చర్యల్లో భాగమని ప్రజలు గుర్తిస్తున్నారని వెల్లడించారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలు పరిచారని గుర్తు చేశారు. ఇందుకు విరుద్ధంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేటా ముంచిందన్నారు. ఈ మోసాల పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బిట్రా నాగాంజనేయులు, వడితే కస్నానాయక్, ప్రగడ రామకోటేశ్వరరావు, చేకూరి మణికుమార్, దామర్ల లక్ష్మీనారాయణ, గోలి వెంకటేశ్వర్లు, రామావతు బాలకృష్ణనాయక్, భవాని, శంకర్, మూడావత్ దుర్గానాయక్, గోలి వీరాంజనేయులు, సునీత, బండారు జయకుమార్, గోపతోటి జాన్, సాపా సైదావలి, తియ్యగూర అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఐఎంఎల్ స్టాక్ నిల్వ కోసం నూతన గోడౌన్ నిర్మించాలి



కలెక్టర్ కార్యాలయం ముందు నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) స్టాకు నిల్వ చేసేందుకు ప్రభుత్వమే నూతన గోడౌన్ నిర్మించాలని ఏపీఎస్‌బీసీఎల్ ఐఎంఎల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గత 40 ఏళ్ల క్రితం నిర్మించి ప్రైవేటు గోడౌన్‌లో ప్రస్తుతం ఐఎంఎల్ డిపో నిర్వహిస్తున్నారన్నారు. దానిలో సుమారు 13 ఏళ్లుగా 92 మంది హమాలీలు పనిచేస్తున్నారన్నారు. గోడౌన్ శిథిలావస్థకు స్టాకు తిరగేయటం చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. దీంతో తామందరమూ కలిసి మరో గోడౌన్‌కు ఏడాదికి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సొంత డబ్బు ఖర్చు చేస్తున్నామని హమాలీలు పేర్కొన్నారు. ప్రభుత్వమే నూతన గోడౌన్ నిర్మించి తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని నాయకులు ఉప్పలపాడి రంగయ్య, కాసా రాంబాబు, చినజాన్‌సైదా, యు.సురేంద్రరెడ్డి కోరారు.

ఎరువులు బ్లాక్‌లో విక్రయించొద్దు

తహసీల్దార్ జెట్టి విజయశ్రీ



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు



ఎరువులు దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

యడ్లపాడు: మండలంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్ బృందంగా ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. యడ్లపాడు గ్రామంలోని 'మన గ్రోమోర్ సెంటర్', 'వికేపీ ఆగ్రో ట్రేడర్స్' దుకాణాలను అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో దుకాణాల్లోని ఎరువుల నిల్వలను, స్టాక్‌రిజిస్టర్‌ను, ఈపీఓఎస్ నిల్వలతో సరిచూశారు. అలాగే, నిత్యావసరాల చట్టం ప్రకారం ధరల పట్టిక, లైసెన్స్ ప్రదర్శించారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయశ్రీ మాట్లాడుతూ ఎరువులను అధిక ధరకు విక్రయించవద్దని, ప్రతిబస్తాకు ఈపీఓఎస్ ద్వారా బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాద్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ప్రతిసారీ బిల్లు తీసుకోవాలని, ఎవరైనా అధిక ధరలకు విక్రయించినా, అనధికారిక నిల్వలు ఉంచినా స్థానిక వ్యవసాయ అధికారికి తెలియజేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కూడా పాల్గొన్నారు.


ఎరువులు కొరత లేకుండా ముందస్తు చర్యలు.

శావల్యాపురం: ఖరీఫ్ సీజను ప్రారంభం నేపథ్యంలో జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ అన్నారు. సోమవారం శావల్యాపురంలో మన గ్రోమోర్ కేంద్రాన్ని ఎరువుల దుకాణాలను మండలస్థాయి అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఖరీఫ్ రబీ సీజనుల్లో ఎరువుల కోసం రైతులు ఇబ్బందుల పడకుండా ఉండటానికి అన్ని దుకాణాల్లో స్టాకులు రికార్డులు తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మార్పీ ధరలకు అమ్మకాలు చేయాలన్నారు. రైతులకు అమ్మిన ఎరువులు పురుగు మందులకు రసీదులు ఇవ్వాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులకు తావులేకుండా దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం మన గ్రోమోర్ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి సూచనలు చేశారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఏవో రామినేని రామారావు గ్రోమోర్ మేనేజరు సురేంద్ర ఉన్నారు.

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

వినుకొండ: కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల షాపుల్లో తహసీల్దార్ సురేష్ నాయక్, ఏవో వరలక్ష్మి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎరువుల, పురుగు మందుల లైసెన్స్, నమోదు చేసుకున్న ఫారం – ఓలు, బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టార్ ప్రకారం ఎరువుల నిల్వలను పరిశీలించడం జరిగింది. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు ఫోన్‌చేసి ఎంఆర్‌పీ ధరలకే కొనుగోలు చేశారా లేదా అని విచారించారు. డీలర్లందరూ కొనుగోలు రైతులకు బిల్లులు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, ఏఈవో ఆరీఫ్, దినకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కే–రిడ్జి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ బర్నబాస్, కోచ్ శివకృష్ణ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి బాల బాలికల సబ్‌జూనియర్ జూడో పోటీలకు కే–రిడ్జి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్ సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3వతేదీ ఆదివారం డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థులు వివిధ విభాగాలలో ఎంపికైనట్టు వివరించారు. బాలురు విభాగంలో ఆనంద్ (45 కేజీలు), హేమహర్షవర్ధన్ (50 కేజీలు), తేజరాహుల్ (55 కేజీలు), బాలికల విభాగంలో సి.హెచ్.నిరీక్షణ (55 కేజీలు), కె.మోక్షజ్ఞ (57 కేజీలు) ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 9, 10 తేదీలలో మంగళగిరి మండలం పెదపరిమిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, కోచ్ ఓ. శివకృష్ణ అభినందించారు.